కవితా కౌముది

## మేలుకొలుపు

రవి ప్రసాద్ చెలమల్లు

వేకువ మొగ్గలు తొడుగుతూ...ఉన్నప్పుడు
కోడి కూత, మసీదు నుండి అజా,
కోవెల గొంతున సుప్రభాతం,
పక్షుల కలకలారవం అన్నీ కలిసి
నన్ను కదిలిస్తే...విని,
మగతలో అటూ, ఇటూ మెసిలి,
మళ్ళీ ముసుగు తన్నేస్తాను

వెలుగు పూలు విచ్చిన కాసేపటికి....
పాడైపోయిన గ్యాస్ స్టౌవ్ లు,రిపేర్ చేస్తామంటూ ఒకరు,
గులాబీ పూలు, బంతిపూలు చామంతి పూలు, అంటూ ఒకరు,
అల్లం-ఎల్లి గడ్డ, ఉల్లి గడ్డ అంటూ మరొకరు,
ఆ పైన కూరగాయలంటూ...,
జీవనోపాధి కోసం రెక్కల కష్టాన్ని నమ్ముకున్న
కేకలు ఎన్నో కర్తవ్యభోధ చేస్తూ...
అంతరంగాన్ని కదిలిస్తాయి,

అంతే...నిద్దుర వదులుతుంది
నేనూ...కదులుతాను కొలువు బాటన

★★★

# జీవితం ఓ కళ
## చందలూరి నారాయణరావు

వాడేదో అన్నాడని
బాధెందుకు?
నీవు అనలేకపోయానని
కొరతెందుకు?

వాడు
నీకు నమూనా.
వాడి
నకలే నీవు.

ఏది చేసినా..
ఏది చూసినా..
తప్పు పట్టే లోకాన్ని చూసి
భయమనే బలహీనత తప్పు.

"అనడం ఒక హక్కు"గా మెలిగే
లోకం ముందు
"అనిపించుకోవడం ఓ బాధ్యత"గా
మెలగడమే మందు.

మెకప్, స్టేజ్, స్క్రిప్ట్ లేని
జీవితం ఓ నటన.
హక్కు బాధ్యతల నడుమ
జీవించడం ఓ కళ..!!

★★★

# స్మశానాలు
## వారాల ఆనంద్

గుట్టలు తమలో తాము
గుస గుస లాడుకుంటున్నాయి

మనల్ని మందు పాతరల్తో పేల్చి
రంపాలతో కోసి చదునుచేసి
ఈ మనుషులు భవంతులు కడుతున్నారు
మెరుపులు దిద్దుకుంటున్నారు

పాపం ఆ తవ్వేసిన రాళ్ళకింద
ఏర్పడ్డ గోతుల్లో
తమ 'స్మశానాల్ని' తామే
సిద్ధం చేసుకుంటున్నామని
తెలుసుకోలేక పోతున్నారు

గుట్టలు తమలో తాము
గుస గుస లాడుకుంటున్నాయి

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఎన్ని మార్లిటు నడచిపోయితిని నేను
ఎన్ని మారులీ బాట వీక్షించినాను
పలుకరించితినిచ్చటి గులకరాళ్ళ
చిగురుటాకుల పూవుల చెట్లనెల్ల

ఈ విశేషములన్ని స్నేహితులు నాకు
ఎదురు చూచును నాకొరకే పథాన
కన్నులార్పక యవి  నన్ను కనుచునుండు
మౌనభాషలో నాతోడ మాటలాడు

ఈ పథమ్మున నొకడినై యేగినపుడు
హృదయముప్పొంగ వాని వీక్షించుచుందు
మౌనముగ పల్కరింతును వానినెల్ల
ఏమి యుద్వేగమియ్యది యెంత ముదము!

వెడలలేనిచో నవి విలపించునేమొ
మరచి యేవేవొ పనులలో మగ్నమౌనొ!
సహజమెల్లరకును దినచర్యలన్ని
బంధములగునె యవి స్నేహబంధములకు?

ఎందరో యిట నడచిపోయెదరు సతము
ఎల్లవారిని ప్రేమింతురెల్లవారు
దారిలోనున్న విరులను తరులనెల్ల
ద్వేషమన్నది సహజప్రవృత్తి కాదు

COMMENTS